క్లుప్తంగా

అంబటికి పురస్కారం



అంబటికి పురస్కారం అందజేస్తున్న సభ్యులు

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు పట్టణానికి చెందిన ప్రముఖ గాయకుడు అంబటి పెద వెంకట్రాజు (పాలకొల్లు గద్దర్)ను తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట్రామారావు కళాసేవ పురస్కారం అందజేశారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, చాంబర్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ, పట్టణ ప్రముఖులు వలవల మల్లికార్జునరావు (బాబ్జి), ముళ్లపూడి బాపిరాజు, జీవీకే మల్లికార్జునరావు, ఎన్ సోమేశ్వరరావు, నేషనల్ ప్రెస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ దూసనపూడి సోమసుందర్, సీపీఎం జిల్లా అధ్యక్షుడు చింతకాయల బాబూరావు తదితరుల చేతుల మీదుగా కళాసేవ పురస్కారం అందుకున్నట్లు అంబటి బుధవారం తెలిపారు. అనంతరం తన టీమ్ సభ్యులతో ఆధ్యాత్మిక గీతాలు ఆలపించినట్టు పేర్కొన్నారు.

కవితా గోష్టిలో హెచ్ఎం సూర్యకుమార్



సూర్యకుమార్‌ను సత్కరిస్తున్న రాజు తదితరులు

పోడూరు : గాంధేయం – మార్గదర్శకం కవితా పోటీలో విజేతల్లో ఒకరైన పోడూరు మండలం చింతలగరువు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్ పెదఅమిరంలో గాంధీజీ 77వ వర్ధంతి సందర్భంగా బుధవారం నిర్వహించిన కవితాగోష్టిలో పాల్గొన్నారు. కవితాగోష్టిలో ఆయన హృదయ విజేత అనే కవితను ఆలపించి తోటికవుల ప్రశంసలు పొందారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎంఆర్ రాజు, జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తదితరులు ఉపాధ్యాయుడు సూర్యకుమార్‌ను సత్కరించి అభినందించారు.

గంగడుపాలెంలో హోమియో వైద్య శిబిరం



గంగడుపాలెంలో వైద్య పరీక్ష చేస్తున్న సిబ్బంది

యలమంచిలి : శ్రీరామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పటల్ సిబ్బంది బుధవారం గంగడుపాలెంలో సెంటర్లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు సిబ్బంది బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఫోన్‌లో వారి ఆరోగ్య ఇబ్బందులను హోమియో వైద్యులు డాక్టర్ కోసూరి రామకృష్ణానందరాజు (పోడూరు రాజు)కు చెప్పించారు. ఫోన్ కాల్‌లో 15 మంది రోగుల సమస్యలను తెలుసుకొన్న డాక్టర్ నివారణకు తగిన సలహాలు సూచనలు చేశారు. అనంతరం డాక్టర్ సిఫారసు మేరకు ఆసుపత్రి సిబ్బంది రోగులకు ఉచితంగా హోమియో పిల్స్ అందజేశారు.

డ్రోన్‌తో పురుగుమందు పిచికారీ



పురుగుమందు పిచికారీ చేస్తున్న డ్రోన్

యలమంచిలి: డ్రోన్ సాయంతో యలమంచిలిలో బుధవారం వరి చేలో పురుగుమందు పిచికారీ చేశారు. రైతులు ఆకివీడు నుంచి ఈ డ్రోన్‌ను రప్పించారు. ఈ డ్రోన్ పనితీరును రైతులతోపాటు వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఒక ఎకరం పొలానికి అవసరమైన మందులో 10 లీటర్ల నీరు మాత్రమే కలిపి పది నిమిషాల్లో పిచికారీ పూర్తి చేసింది. ఎకరాకు రూ.400 తీసుకుంటూ ఈ పిచికారి చేస్తున్నారు. డ్రోన్‌తో రైతులకు కూడా సులభ తరంగా, తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో, తక్కువ నీటితో, తేలికగా పిచికారీ పూర్తయింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, గ్రామ సర్పంచ్ బల్లే మేరీ ప్రసాద్, రైతులు చిలుకూరి శ్రీనివాస్, బొప్పన చిన్న, తాడి శ్రీధర్ తమ్మినీడి విశ్వేశ్వరరావు, కాసా ఆంజనేయులు, ఉద్యాన సహాయకురాలు స్వప్న పాల్గొన్నారు.

మద్యం షాపుల కేటాయింపు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆచంట, పోడూరు మండలాలకు గీత కులాలకు రెండు మద్యం షాపులు కేటాయించినట్టు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. శెట్టిబలిజలు పోడూరు, ఆచంట మండలాల్లో కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రూ.2 లక్షల దరావతు ఫీజుతో ఫిబ్రవరి 5లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పరాయి పంచన పోలీస్ స్టేషన్

- శిథిల భవనంలో వెతలు
- వర్షం వస్తే లీకవుతున్న నీరు
- కొత్త భవనంలోకి వెళ్లేదెప్పుడో?



పెనుమంత్రలో విద్యాశాఖ శిథిల భవనంలో ఉన్న పోలీస్ స్టేషన్



పోలీస్ స్టేషన్ కోసం సిద్ధం చేసిన మండల పరిషత్ భవనం

పెనుమంత్ర: పెనుమంత్ర పోలీస్ స్టేషన్ పరాయ పంచన శిథిల భవనాల్లో కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న విద్యాశాఖ భవనంలో వర్షాకాలంలో నీరు లీకవుతుండడంతో రికార్డులను కాపాడుకోవడం కష్టతరంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ హయాంలో తాలూకా వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా మండల వ్యవస్థను తీసుకొచ్చారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 15 నుంచి 25 గ్రామాలను ఒక మండలంగా విభజించి, ప్రతి నియోజకవర్గంలో మూడు నుంచి నాలుగు మండలాలను కేటాయించారు. ఇందులో ప్రతి మండలానికీ ఒక మండల ప్రజా పరిషత్‌తో పాటు మండల రెవెన్యూ, పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. నాటి నుంచి పెనుమంత్ర పంచాయతీ పరిధిలో బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో ఉన్న సమితి భవనాన్ని మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాలకు ఉపయోగిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌ను మాత్రం పెనుమంత్రలో ఒక అద్దె భవనంలో ఏర్పాటుచేశారు. కొంతకాలం అనంతరం బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో ఒక అద్దె పెంకుటింట్లోకి పోలీస్ స్టేషన్‌ను మార్చారు. ఆ ఇంటి యజమాని కూడా ఖాళీ చేయమని ఒత్తిడి చేయడం, ఎక్కడా భవనం దొరకని పరిస్థితిలో నాటి అత్తిలి ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు చొరవతో మండల పరిషత్‌లోని విద్యాశాఖకు చెందిన పాత భవనంలో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. సొంత భవనం నిర్మాణానికి స్థానిక ప్రజా ప్రతినిధులు కృషిచేసినప్పటికీ పోలీస్ అధికారుల నుంచి సరైన స్పందన లభించకపోవడంతో పోలీస్ స్టేషన్ 20 ఏళ్లుగా విద్యాశాఖ శిథిల భవనంలోనే కొనసాగుతోంది.

గృహ ప్రవేశం ఎప్పుడో?

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల పరిషత్‌లో ఖాళీగా ఉన్న మరో భవనంలోకి మార్చడానికి తీర్మానించినా, పోలీస్ స్టేషన్ మరమ్మతులకు పోలీస్ అధికారులు ముందుకురాకపోవడవంతో ఇటీవల ఆ భవనాన్ని మండల పరిషత్ నిధులతోనే మరమ్మతులు చేసి, పోలీస్ స్టేషన్ ఆ భవనంలోకి మార్చడానికి సిద్ధం చేశారు. అయితే ఆ భవనంలోకి పోలీసులు ఎప్పుడు గృహ ప్రవేశం చేస్తారో వేచి చూడాల్సిన ఉంది.

త్వరలోనే కొత్త భవనంలో విధులు

మండల పరిషత్ ఆవరణలో మరమ్మతులు చేసిన భవనంలోకి పోలీస్ స్టేషన్ తరలించడానికి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు అనుమతి కోరాం. వారి నుంచి అనుమతులు రాగానే కొత్త భవనంలో కార్యకలాపాలను ప్రారంభిస్తాం.

– కె.స్వామి, ఎస్సై, పెనుమంత్ర

కాలుష్యరహిత పర్యావరణాన్ని అందించాలి



ఎస్ఆర్ఆర్‌పేటలో మొక్క నాటుతున్న వీరాస్వామి

పోడూరు : భావి తరాలకు కాలుష్య రహితమైన పర్యావరణాన్ని అందించేందుకు కృషిచేయాలని సొసైటీ మాజీ చైర్మన్ కొత్రపాటి వీరాస్వామి అన్నారు. గోదావరి పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం పెనుమదం శివారు ఎస్ఆర్ఆర్ పేటలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు వాతావరణంలో సమతుల్యం కోసం వృక్ష సంపద ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. గోదావరి పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమితి కార్యదర్శి తానేటి శేఖర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరిగిన నేటి పరిస్థితుల్లో పర్యావరణాన్ని కాపాడుకునేందుకు మొక్కలు నాటేందుకు, వృక్షాలను సంరక్షించుకొనేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు.

వాస్తవాలు తెలుసుకోండి





సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు , మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ

- వైఎస్సార్‌సీపీపై నెపాలు వేయకండి
- మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు ఏడిద

నరసాపురం: వాస్తవాలు పూర్తిగా తెలియకుండా వైఎస్సార్‌సీపీపైనా, తమ నాయకుడు ముదునూరి ప్రసాదరాజుపైనా నెపాలు వేయొద్దని వైఎస్సార్ సీపీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఏడిద కోటసత్యనారాయణ (వైకేఎస్) టీడీపీ కౌన్సిలర్ పాలూరి బాబ్జిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వేములదీవి గ్రామంలో మున్సిపల్ డంపింగ్ యార్డ్ స్థలం కొనుగోలు, అక్కడి స్థలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు పట్టాలిచ్చిందనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. పలువురు స్వపక్ష కౌన్సిలర్లు కూడా మున్సిపల్ స్థలం మాయమైందని ఆరోపించారు. ఈ క్రమంలో టీడీపీ కౌన్సిలర్ బాబ్జి వ్యవహారంలో వైఎస్సార్‌సీపీ ప్రమేయం ఉందని ఆరోపించడంతో వైకేఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఆస్తులు పోతే ఊరుకునే ప్రశక్తే లేదన్నారు. కౌన్సిలర్లు, అధికారులతో కూడిన ఓ కమిటీ వేసి అసలు వేములదీవి మున్సిపల్ డంపింగ్ యార్డ్ స్థలం కొనుగోలు విషయంలో ఏం జరిగింది, నష్ట నివారణ ఎలా చేసుకోవాలోతేల్చుకోవాలని సూచించారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ కమిటిని నియమిస్తామని చెప్పారు. మున్సిపాలిటీలో అత్యవసర పనులంటూ వేస్తున్న బాక్స్ టెండర్ల అంశంలో గోల్‌మాల్ జరుగుతుందని కౌన్సిలర్లు వన్నెంరెడ్డి శ్రీనివాస్, కేసరి గంగరాజు ఆరోపించారు. మున్సిపల్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడే విషయంలో మున్సిపల్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, బొంతు రాజశేఖర్ సూచించారు. పలు సమస్యలపై సభ్యులు కావలి రామసీత, గోరు రమాదేవి, కోటిపల్లి సరేష్, సఖినేటిపల్లి సురేష్, సిర్రా కాంతమ్మ, మల్లాడి శేషవేణి, ద్వారా గంగాభవానీ మాట్లాడారు. సభ్యుల ప్రశ్నలకు కమిషనర్ ఎం అంజయ్య సమాధానం ఇచ్చారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ



పాలకొల్లు అర్బన్ : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న చిన్నయ్య



పెనుగొండ : గురుకుల పాఠశాలలో తనిఖీ చేస్తున్న శ్యాంసుందర్

పాలకొల్లు అర్బన్ : స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై జిల్లా కోఆర్డినేటర్ గుంటపల్లి చిన్నయ్య బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, ఆహార పదార్థాల నాణ్యత, గుడ్డు పరిమాణం, మరుగు దొడ్లు, స్కూల్ కిచెన్ గార్డెన్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, సీఆర్‌పీ లింగేశ్వరరావు, రామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

పెనుగొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను సమగ్ర శిక్షణ అడిషినల్ ప్రాజెక్టు డైరక్టరు పి.శ్యాం సుందర్ ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం పాఠశాలను పరిశీలించి పీఎం శ్రీ నిధుల వినియోగం, రికార్డులను పరిశీలించారు. పాఠశాలకు పాల్ ల్యాబ్‌ను మంజూరు చేసినట్టు ప్రకటించారు.

- వడలిలోని మండల పరిషత్ ప్రధాన పాఠశాలలోని భవిత సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సెంటర్‌లో కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం పిల్లలతో యోగా నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రుల అకౌంట్‌ల్లోకి రవాణా, ఎస్కార్ట్, స్టైఫండ్, రీడర్ అలవెన్సులు జమ చేయనున్నట్టు చెప్పారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన పరిశీలనల్లో కో ఆర్డినేటర్ సీహెచ్‌వీ సుబ్రహ్మణ్యం, ఏఎస్‌ఓ వై శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరు క్వీనీ, వి.అనంత నాగలక్ష్మి, జి.విద్యా సాగర్‌లు పాల్గొన్నారు.

సంపూర్ణ ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న భాస్కరరావు తదితరులు

పోడూరు : పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని కేఎస్‌వీఎన్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ కొట్టి భాస్కరరావు సూచించారు. స్థానిక జెడ్పీహైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం కేఎస్‌వీఎన్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. స్టడీ మెటీరియల్ అందజేయడానికి సహకరించిన యర్రంశెట్టి పద్మారావు, భవాని ఫైనాన్స్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాయకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా అన్ని సబ్జెక్టులూ చదివి పాసవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూలు హెచ్ఎం జి.రామచంద్రరావు, బొలిశెట్టి విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

పాలకొల్లు అర్బన్: స్థానిక ఏఎస్‌ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ సబ్జెక్టులో అతిథి అధ్యాపక పోస్టు నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ డిగ్రీ కలిగి 55 శాతం ఆ పైన మార్కులు కలిగిన అభ్యర్థులు, అదనపు అర్హతలు పీహెచ్‌డీ, నెట్, ఏపీ నెట్, బోధన అనుభవం కలిగి ఐసీటీ టూల్స్ ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానం ద్వారా బోధించ కలిగే అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులను ఫిబ్రవరి 5లోగా కళాశాలలో అందజేయాలని, 6వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకి హాజరుకావాలని కోరారు.

వడలిలో ప్రజా దర్బార్

పెనుగొండ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం వడలి పంచాయతీ వద్ద బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఇళ్ల స్థలాలకు 414, రేషన్ కార్డులకు 96, పింఛన్లకు 82, మరుగుదొడ్లకు 11 దరఖాస్తులు అందినటుట్ల నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికలపై మొక్కుబడిగా శిక్షణ





పెనుమంత్రలో శిక్షణలో మాట్లాడుతున ద్వాక్రా ఏపీఎంవీ పద్మ, శిక్షణకు హాజరైన ప్రజాప్రతినిధులు

పెనుమంత్ర: 2025–26 సంవత్సరానికి మండల స్థాయిలో వార్షిక ప్రణాళికలను సిద్ధం చేసేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు ఏర్పాటుచేసిన బుధవారం ఒక్కరోజు శిక్షణ మొక్కుబడిగా సాగింది. మండలంలోని 36 మందికి 15 మంది ప్రజాప్రతినిధులే హాజరయ్యారు. మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతి రూపొందించాల్సి స్థానిక అధికారుల హాజరు అంతంతమాత్రంగానే ఉండటంతో కొందరు ప్రజాప్రతినిధులు హాజరైన కొద్ది సమయంలోనే కొందరు శిక్షణ నుంచి వెళ్లిపోయారు. దీంతో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించాల్సిన ఈ శిక్షణ కొద్ది గంటలకే ముగించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శామ్యూల్ ఎఫ్ఎస్, డ్వాక్రా ఏపీఎంఓ పి.పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వరలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ వీవీ రమణ పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి

పెనుగొండ: సమగ్ర ప్రణాళికలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు అన్నారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి గ్రామాల్లో సమస్యల గుర్తింపు, నిధుల కేటాయింపు, వినియోగం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, వెలుగు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పాలకొల్లు అర్బన్: గ్రామాభివృద్ధికి ప్రతిపాదించిన పనులను ఈ గ్రామ్ స్వరాజ్ యాప్‌లో ఈ నెల 31లోగా అప్‌లోడ్ చేస్తేనే 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని ఈవోపీఆర్‌డీ తాళ్ల మూర్తిబాబు తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ శిబిరాన్ని ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, మండల పరిషత్ ప్రతిపక్షనేత శాగ సత్యనారనారాయణ పాల్గొన్నారు.

పశువులతో అదనపు ఆదాయం



యలమంచిలి : మేడపాడులో పాడి పశువులకు పరీక్ష చేస్తున్న డాక్టర్ చంద్రశేకరరెడ్డి

యలమంచిలి: రైతులకు వ్యవసాయంతోపాటు పాడి పశువులు కూడా అదనపు ఆదాయమని మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు అన్నారు. యలమంచిలి మండలం మేడపాడు గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేకరరెడ్డి తన సిబ్బందితో కలిసి 54 పశువులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. శిబిర నిర్వహణకు పశు సంవర్ధక సహాయకులు జాజిత, జాజిమొగ్గల హేమలత, నిల్లా కోట సత్యశ్రీ, సతీష్, షబీర, తరుణ్, దుర్గా భవాని, దొరబాబు, వెంకన్న బాబు, జగన్నాథరావు, సునంద సహకరించారు. కనకాయలంక, పెదలంక గ్రామాల్లో గురువారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని డాక్టర్ పోరెడ్డి చంద్రశేకరరెడ్డి తెలిపారు.

లేగదూడల ప్రదర్శన

నరసాపురం రూరల్: నరసాపురం మండలం చామకూరిపాలెం గ్రామంలో రైతు సేవాకేంద్రం వద్ద పశు ఆరోగ్య శిబిరం, లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. బుధవారం వీటిని గ్రామ సర్పంచ్ బొక్కా రామస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఏ వై.సుధాకర్, డాక్టర్ ఇంజేటి సురేంద్రకుమార్‌లు లేగదూడల పెంపకంపై అవగాహన కలిగించారు. ఈ ప్రదర్శనలో గుత్తుల వెంకటేశ్వరరావు, మల్లుల బ్రహ్మారావు, కొల్లాటి వెంకటేశ్వరరావులకు చెందిన లేగ దూడలు మొదటి, రెండు, మూడో బహుమతులు సాధించగా మిగిలిన 23 దూడల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా 326 గొర్రెలు, మేకలకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యులు మౌర్య, నీలిమ, పుష్ప ఏంజిల్, నారా కృష్ణసాయి, చందుకుమార్, పి.నరేష్, సిహెచ్ సుదీర్, రహీమ్, దీపిక, అంజిరెడ్డి, భార్గవి తదితర సిబ్బంది పాల్గన్నారు.



నరసాపురం రూరల్ : చామకూరిపాలెంలో లేగదూడల ప్రదర్శన

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

నరసాపురం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ సూచించారు. మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు అంశాలపై మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వైఎన్ బీఈడీ కళాశాలలో గత నెలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. జడ్జి కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జడ్జి విజయదుర్గ మాట్లాడుతూ విద్యాదశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవడం, సమాజంలో రుగ్మతలపై చైతన్యం కలిగి ఉంటడం అవసరమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.శాంత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ పాల్గొన్నారు.

నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు



చినఅమిరంలో ఆక్వా మందుల షాపులో తనిఖీ చేస్తున్న ప్రసాద్

భీమవరం అర్బన్: రొయ్యలు, చేపలు పెంపకానికి నిషేధిత యాంటీబయోటిక్స్ విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేసి యజమానులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ హెచ్చరించారు. భీమవరం మండలంలో ఆక్వా మందుల షాపులపై బుధవారం జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఆక్వా పెంపకంలో యాంటీబయోటిక్స్ వాడకం నిషేధమన్నారు. నిషేధిత యాంటీబయోటిక్స్ విక్రయించడం నేరమన్నారు. దుకాణదారులు విక్రయించినట్లు తెలిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్వా మందుల విక్రయిస్తున్న దుకాణదారులు తప్పకుండా ఆంధ్రప్రదేశ్ ఆక్వా కల్చర్ అథారిటీ అప్పడా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతి ఉన్న ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని సూచించారు. జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ వెంట మత్స్యశాఖ ఏడీ సీహెచ్ వేంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

హామీలు అమలు చేయండి

భీమవరం: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలపై ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేదల నుంచి ఇండ్ల స్థలాల కోసం ఆర్జీలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన కూటమి నాయకులు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటిస్థలం ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామన్న హామీ ఏమైందని రంగారావు ప్రశ్నించారు. వెంటనే ఇళ్ల స్థలాలు పంపిణీ చేపట్టకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా నాయకులు వై.వీ.ఆనంద్, ఎం లక్ష్మీపతి, పాలా దాసు పాల్గొన్నారు.